# ఆంధ్రాలో మసి పూస్తే ఆస్టిన్‌లో మారేడు కాయ

- పోడూరి కృష్ణకుమారి

లాయర్ పురుషోత్తమ్, అంజలిల ఒక్కగానొక్క కొడుకు పెళ్ళిచూపుల్లో పిల్ల నచ్చిందని చెప్పగానే చెప్పేశారు కట్నం తీసుకోకూడదన్నది తమ ఆదర్శమని, కాస్తంత స్నేహభావం తప్ప పిల్ల తరఫునుంచి తామేమీ కానుకలు ఆశించట్లేదని గౌరవాభిమానాలు తప్ప తామేం డిమాండ్ చెయ్యమని, "మీకున్నంతలో పెళ్లి చేసెయ్యండి" అన్నాడు పురుషోత్తమ్ పిల్ల తండ్రి మదనకామరాజుతో.

మదన కామరాజు మాత్రం ఊరుకోలేదు. "మీరొద్దంటే మాత్రం మేం ఊరుకుంటామా?" అన్నాడు.

"మేం ఏదీ తక్కువ చెయ్యం" అన్నాడు.

"మీకు నచ్చిన హాలే బుక్ చేద్దాం నాలుగూ చూసి రండి" అని ఓ రోజు "మీకు బాగా తెలిసిన క్యాటరర్ ఉన్నాడన్నారుగా మాట్లాడదాం పదండి" అని మరోరోజు పురుషోత్తమ్ కార్లోనే ఊరంతా తిరిగి అన్నీ బుక్ చేశాడు.

'వియ్యంకుడు సరదా మనిషిలాగే ఉన్నాడు' అనుకున్నాడు అంజలి, పురుషోత్తమ్.

పెళ్లికి బంధువులంతా వచ్చారు. హాల్లో పెళ్లి, డైనింగ్ హాల్లో బఫే జోరుగా సాగుతున్నాయి. పురుషోత్తమ్ పెద్దక్కగారు కళ్లనీళ్ళు కుక్కుకుంటూ వచ్చి పురుషోత్తమ్‌ని పక్కకి పిలిచింది.

"ఏం చేశావురా తమ్ముడూ? పిల్ల తరఫు వాళ్ళంతా మీగురించి ముష్టాళ్ల కన్నా హీనంగా మాట్లాడుకుంటున్నారు. హాలు, డెకరేషన్ దగ్గర్నుంచి కేటరింగ్, బట్టలు వరకూ అన్నీ మాకివే కావాలని డిమాండ్ చేసి చేయించుకుంటున్నారు. ప్రతిదీ అడుక్కుతింటున్నారు మగపెళ్లివారని చెప్పుకుంటున్నారు వాళ్లంతా. ఇదా నీ సంస్కారం?" భోరుమంది పెద్దక్క.

స్టన్నయిపోయి నోటమాటరాక నిలబడ్డారు పురుషోత్తమ్, అంజలి.

"అన్నయ్యా! మనం సహించొద్దు. తాళి కట్టడం అయిపోయిందిగా తక్షణం పిల్లని తీసుకుని వెళ్లిపోదాం" అభిమానపడింది చిన్న చెల్లెలు.

పురుషోత్తమ్ చేతులు జోడించాడు "ఇప్పుడు మనం వెళ్ళిపోయామంటే కట్నం చాల్లేదనీ, కానుకలు పెంచమనీ గొడవ చేసి పెళ్ళి తంతు పూర్తికాకుండా వెళ్ళిపోతున్నారని దండోరా వెయ్యగల సమర్థుల్లా ఉన్నారు వీళ్ళు. ఈ ఫళంగా కోర్టుకెడితే చట్టం కూడా వీళ్ళ పక్షానే పలుకుతుందని మీరంతా సాక్ష్యం పలికినా సరే. ఎన్నిటికని సాక్ష్యం తేగలం? మన గోడువినే లోకం కాదమ్మా ప్రస్తుతం. మహిళా సంఘాలు బ్యానర్లు పట్టుకుని స్లోగన్లు అరుస్తూ వచ్చి పడిపోతారమ్మా. ఒక్క గంట సహనం వహిద్దాం. అప్పగింతల కార్యక్రమం కూడా కానిచ్చి వెడదాం"

"అన్నయ్యా! మగపెళ్ళివారం. ఏ పెత్తనమూ చెయ్యకుండా మర్యాదగానే ఉన్నాం ఇంతసేపూ. అయినా అవమానం! నువ్వేమో దీనంగా మాట్లాడతావ్"

"దీనంగానే ఉందమ్మా మగపిల్లల తల్లిదండ్రుల పరిస్థితి. అసలా మదన కామరాజు "అయ్యా నేనీ లెవెల్లో పెళ్ళి చెయ్యలేను" అని ఒక్కమాట అనుంటే ఉభయ ఖర్చులూ నేనే పెట్టుకుని నేనీ పెళ్ళి చేసుండేవాణ్ణి కదమ్మా? నా సంగతి మీకు తెలియదా? ఆ మదనకామరాజు ఏదో ప్లాన్ మీదే చేస్తున్నాడిదంతా. మనల్ని అడకత్తెరలో పెట్టి ఆనందిస్తున్నాడు. ప్రస్తుతానికి సహనమే మన కవచం"

"హుఁ! ఆ కుసంస్కారుల గూటి చిలక నా మేనల్లుడ్నేం సుఖపెడ్తుంది?" నిట్టూర్చింది పెద్దక్క.

★ ★ ★

ఆస్టిన్‌లో సరళ చెప్తోంది "సరోజిని పెళ్లికి కట్నం లేదని పేరుకేగానీ ఏ కళ్యాణ మంటపంలో పెళ్ళి చేయాలో, డెకరేషన్లూ, కేటరింగులూ ఎవరికివ్వాలో లాంఛనాలు ఏమివ్వాలో అన్నీ లెక్కలేసి చెప్పారుట. మాటిమాటికీ మేం కట్నం తీసుకోవట్లేదు అని గుర్తుచేస్తూ మిగతా వాటికి ఘనంగా ఖర్చు చేయిస్తున్నారట. పది పన్నెండు లక్షల దాకా అవుతుందని మొదటి అంచనా!" నిట్టూర్చాడు సరళపతి. "అంత పెట్టుకోలేనివాడు అటువంటి సంబంధానికెందుకెళ్లాడసలు?" అని అడగలేదు.

★ ★ ★

పెళ్ళయి వెళ్ళిన ఏడాదికి సెలవు పెట్టుకుని జబ్బుగా ఉన్న తల్లిని చూడ్డానికి ఢిల్లీనుంచి వచ్చాడు ఉత్తమ్‌కుమార్.

"కోడలు రాలేదేం?" అడిగారు తల్లీతండ్రీ.

"తను పుట్టింటికెళ్లింది నెలక్రితం"

"ఈ ఊరేగా? ఫోనైనా చెయ్యలేదేం ఆ అమ్మాయి?" తల్లి కొడుకుని అనుమానంగా చూసింది.

కాసేపు మౌనం తర్వాత చెప్పాడు "ఈ ఏడాదిలోనూ ఇది అయిదో విజిట్. వచ్చినప్పుడల్లా నెల రోజులుంటుంది. మీ మొహం చూడదు. మీకు ఫోనైనా చెయ్యదు. నాకు తెలుసు. మీకు తెలీదు"

"మరి నువ్వేమీ అనవా?"

"డబ్బు విషయంలో గానీ, నాతో కాపురం చెయ్యమని గానీ ఏ రకమైన ఒత్తిడి తెచ్చినా మన మీద డౌరీ హెరాస్‌మెంట్ కేసు పెడ్తుందిట. కోర్టులో తనొక్క కాగితం తగిలిస్తే చాలు నిజానిజాలు చూడకుండా ముందు మనముగ్గుర్నీ అరెస్ట్ చేస్తారు. తరువాత ఎమైనాగానీ నాదసలే సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం. మిమ్మల్నీ బాధపెట్టడం ఇష్టం లేక నోరు మూసేసుకున్నా"

"అవున్లే. రోజులలా ఉన్నాయి. మగాళ్ళ అన్యాయలనించి స్త్రీలని కాపాడాలని చేసిన చట్టాలతో కొందరు గడసరులు అమాయకపు మగాళ్ళకి ఉచ్చులు బిగిస్తున్నారు. నిజంగా అన్యాయంచేస్తున్న వాళ్ళనడిగే నాథుడు లేడు"


★ ★ ★

ఆస్టిన్‌లోని తరళ చెప్తోంది "మా కజిన్ విలాసిని మొగుడు లేడూ ఉత్తమ్ కుమార్? వాడొట్టి కట్న పిశాచిట. ఇంకాతే ఇంకాతే అని దాన్ని మాటిమాటికీ పుట్టింటికి తరుముతాడుట. ఈ ఏడాదిలోనూ అయిదుసార్లు పంపేసాట్ట. వాళ్ళనాన్న అందినచోటల్లా అప్పులు చేసి అల్లుడి దాహం తీరుస్తాట్ట. హేవిటో! ఎన్ని చట్టాలున్నా ఆడవాళ్ళ కష్టాలు మారలేదు. మధ్యతరగతి బతుకులు మారలేదు" నిట్టూర్చాడు తరళపతి.

★ ★ ★

అమెరికానించొచ్చిన వారానికల్లా పిన్నికి పెరాలిటిక్ స్ట్రోక్ వచ్చిందన్న వార్త విని ఆదరాబాదరాగా బయల్దేరి హైద్రాబాద్ వెళ్లింది సౌమ్య. పిన్ని

మంచం పక్కనే కూచుని కబుర్లు చెప్తూ "నాగినేది పిన్నీ? ఎటైనా వెళ్లిందా?" తనకన్నా నెల రోజుల ముందే యుఎస్ నించి వచ్చిన పిన్ని కోడలు నాగిని గురించి అడిగింది.



పిన్ని మౌనంగా కళ్ళు తిప్పుకుంది. బాబాయ్ నిట్టూర్చాడు. పెళ్ళయి అమెరికా వెళ్ళి అయిదేళ్ళు దాటుతున్నా ఒక్కసారి కూడా ఇండియా రాలేదు పిన్నికొడుకు. నాగిని మటుకు మూడుసార్లొచ్చి 'ఎంజాయ్' చేసి వెళ్లింది. ఇది నాలుగోసారి. 'ఇంక వాడి ప్రయాణం ఖర్చు లెక్కడి నించి వస్తాయి?' అనుకుని కళ్లనీళ్ళు దాచుకుంది సౌమ్య. మేనత్త కూతురి పెళ్ళిలో నఖశిఖపర్యంతం రకరకాల నగలతో గంగిరెద్దులా గలగలలాడుతూ తిరుగుతున్న నాగినిని చూసి ఆశ్చర్యపోయింది సౌమ్య. పక్కనున్న అమ్మలక్కల మాటలు విని మరింత ఆశ్చర్యపోయింది.

"నాగిని అమెరికాలో ఏదో స్కూల్లో టీచర్గా చేరి అప్పుడే ప్రిన్సిపాలై పోయిందిట! తన సంపాదనతోనే ఆ నగలన్నీ కొనుక్కుందిట. ఏమైనా మనచుట్టాల్లో ఆ వయసు పిల్లలందర్లోనూ నాగినే తెలివైంది" ఒంటిమీది బంగారం బరువుని బట్టీ మెదడులో తెలివిని అంచనా వేశారు అమ్మలక్కలు.

★ ★ ★

ఆస్టిన్లోని విరళ చెప్తోంది "పాపం నా ఫ్రెండ్ నాగిని ఓ రెణ్ణెళ్ళు ఎంజాయ్ చేసొద్దామని ఇండియా వెళ్లిందా? వాళ్లత్తగారేమో లేనిపోని రోగాలు నటించి మంచం దిగకుండా సేవల్చేయించుకుందిట. ఏనాడో జరిగిన పెళ్ళినాటి మాటలెత్తి ఈ లాంఛనాలు తీరలేదు, ఆముచ్చట్లు జరగలేదు అని సాధించి పోసిందిట. ఏవిటో మన దేశం! కట్నాల సమస్య తీరదు. ఆడపిల్లల బతుకులు మారవు. అత్తగార్లు మారరు"

నిట్టూర్చాడు విరళ పతి.

★ ★ ★


"నాన్నగారు చాలా అవసరంగా ఉంది డబ్బు పంపమన్నారు" అంది వినోదిని.

"ఏదో కొన్నాళ్ళు పోనీలే అని పంపాను. ఇంకెప్పటికీ నీ పేరెంట్స్ని నేనే పోషించాలంటే కుదరదు. నా సంపాదన మనకే బొటాబొటీగా ఉంది. నువ్వు సంపాదించి పంపుకో మహారాజులా" ఖచ్చితంగా చెప్పాడు.

"ఉద్యోగం చూపించు సంపాదిస్తా"

"చూపించిన రెండు ఉద్యోగాలు సొంత టాలెంట్తో పోగొట్టుకున్నావు. ఇక నావల్లకాదు"

"నాకు ఇండియాలో ఉద్యోగం చూసి రెడీగా పెట్టారు మా నాన్నగారు. పోతా. మావాళ్ళని నేనే పోషించుకుంటా"



"నీ ఇష్టం. ఎకడమిక్ ఇంట్రెస్ట్ కొద్దీ అడుగుతున్నా. మీనాన్నకి పెన్షన్ రాదా?"

"రాదు. ఆఫీసు సొమ్ము మింగినదానికీ, పెన్షన్కీ సరిపెట్టి సగౌరవంగా ఉద్యోగం విరమింపచేశారు ఆఫీసువాళ్ళు. ఆయనకి పైసా ఆదాయం లేదు" అని చెప్పలేదు విలాసిని. ఇండియా వెళ్ళి దొరికిన ఉద్యోగంలో చేరిపోయింది.

"ఎన్నారై మీద డౌరీ హెరాస్మెంట్ కేస్ ఎలా పెట్టాలి? ఎంత లాగచ్చు" అని ప్లీడర్లతో మంతనాలు చేస్తున్నాడు తన సప్తవ్యసనాల ఖర్చు ఆడపిల్ల సంపాదనతోనే గడుపుకునే వ్యసనం గల వినోదిని తండ్రి.

★ ★ ★

ఆస్టిన్లో అంగళ చెప్తోంది "ఇన్నేళ్ళుగా అమెరికాలో ఉంటున్న వినోదిని మొగుడు సంస్కారం నేర్చుకోలేదు. కట్నం తక్కువైందని పెళ్లాన్ని హింసించాట్ట. హైదరాబాద్లో మామగారి ఫ్లాట్ తన పేర్న రాయించుకురమ్మని ఇండియా తరిమేసాట్ట. హేవిటో! ఇండియాలో పెళ్ళిళ్ళూ ఆడపిల్లల జీవితాలూ!"

నిట్టూర్చాడు అంగళపతి.

(పైన చెప్పినవన్నీ కల్పనలే. కానీ అసంభవం మాత్రం కాదు. చట్టాన్ని దురుపయోగపరిచే అవకాశాలను ఎత్తి చూపడమే ఈ రచన లక్ష్యం. పవిత్ర భారతదేశంలో పెళ్ళి అనే పవిత్రమైన సాలెగూడులో చిక్కుకుని గుప్పెడంత గుండెలో కొండంత విషాదం దాచిపెట్టుకుని నరకయాతన అనుభవిస్తున్న దగాపడ్డ తమ్ముళ్లకీ, వారిని కన్న తల్లిదండ్రులకీ ఈ రచన అంకితం)